లోకం పోకడ

నేను బతికేవున్నట్టు ఇకనైనా నమ్ముతారా? లేదా?

తప్పు రుద్దబోయి.. తానే తప్పుకుని

లేఖ ద్వారా సుప్రీంకోర్టుకు తెలిపిన జస్టిస్ నర్సింహారెడ్డి

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): మాజీ సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లు, నూతన విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుపై దర్యాప్తునకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ పదవి నుంచి జస్టిస్ (రిటైర్డ్) ఎల్ నరసింహారెడ్డి తప్పుకున్నారు. తాను దర్యాప్తు చేసిన అంశాలలోని న్యాయాన్యాయాలను జస్టిస్ నరసింహారెడ్డి మీడియాకు వెల్లడించడాన్ని సుప్రీంకోర్టు మంగళవారం తప్పుబట్టింది. కమిషన్ చైర్మన్‌ను మార్చాలని, ఆయన స్థానంలో కొత్త చైర్మన్‌ను నియమించాలని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సోమవారంలోపు కొత్త చైర్మన్‌ను నియమిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈఆర్సీ ఆమోదించిన అంశాలపై ప్రభుత్వం విచారణ సంఘాన్ని నియమించడం చట్టవిరుద్ధమని, విచారణ సమయంలోనే జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించారని, పక్షపాతంగా వ్యవహరించారని, విచారణ పూర్తికాక ముందే అనేక అంశాలను బహిర్గతం చేశారని ఆరోపిస్తూ మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పార్దీవాలా, మనోజ్‌మిశ్రాతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ, సిద్ధార్థ్ లూత్రా, కేసీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. భోజన విరామానికి ముందు జరిగిన వాదనల అనంతరం ధర్మాసనం.. 'న్యాయం జరగడమే కాదు.. న్యాయం జరిగినట్టు కనిపించాలి కూడా విచారణ కమిషన్‌గా చైర్మన్‌గా ఉన్న ఆయన (జస్టిస్ నరసింహారెడ్డి) తాను కనుగొన్న అంశాలలోని న్యాయాన్యాయాలను ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. అందువల్ల దర్యాప్తు కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ నరసింహారెడ్డి స్థానంలో మరొకరిని నియమించే అవకాశం మీకు (తెలంగాణ ప్రభుత్వానికి) కల్పిస్తున్నాం. ఆయన స్థానంలో మరొక జడ్జిని నియమించండి ' అని ఆదేశించింది. అనంతరం భోజన విరామం తర్వాత విచారణ కొనసాగిస్తామని తెలిపింది. ఈ సమయంలోనే అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. విద్యుత్తు విచారణ సంఘం బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు ఓ న్యాయవాది ద్వారా జస్టిస్ నర్సింహారెడ్డి సుప్రీంకోర్టుకు లేఖను పంపించారు. దీంతో ఆయన స్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయస్థానం సమయమివ్వగా, సోమవారం లోపు నూతన చైర్మన్‌ను నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో సుప్రీంకు..

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ నర్సింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని ఏర్పాటు చేసింది. తమ ముందు హాజరు కావాలని ఆదేశిస్తూ జస్టిస్ నర్సింహారెడ్డి.. కేసీఆర్ సహా 28 మందికి లేఖలు రాశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూలై 30 వరకు గడువు కావాలని కేసీఆర్ కోరారు. అయితే జూన్ 11న మీడియా సమావేశం నిర్వహించిన జస్టిస్ నర్సింహారెడ్డి వివరాలను వెల్లడించారు. జూన్ 15న కేసీఆర్ 12 పేజీల లేఖను విచారణ సంఘానికి పంపించారు. విద్యుత్తు కమిషన్ చట్టబద్ధం కాదని, నర్సింహారెడ్డి ఆ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఆ తదనంతరం విచారణకు హాజరవ్వాలని కేసీఆర్‌కు విచారణ సంఘం మరో లేఖను పంపించింది. దీంతో కేసీఆర్ జూన్ 24న హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను ఈ నెల ఒకటిన హైకోర్టు కొట్టివేసింది. ఆ నిర్ణయాన్ని సవాలుచేస్తూ 10న సుప్రీంకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేయగా, మంగళవారం సుప్రీంకోర్టు విచారించి, నర్సింహారెడ్డిని బాధ్యతల నుంచి తప్పుకోవాలని ఆదేశించింది.

తానే తప్పుకుని..

దర్యాప్తు చేపట్టిన జస్టిస్ నర్సింహారెడ్డి.. కేసీఆర్‌పై తప్పులు ఆపాదించబోయి.. చివరికి తానే తప్పుకునే స్థితిని తెచ్చుకున్నారు. విచారణ పూర్తి కాకుండానే బీఆర్‌ఎస్ సర్కారు అనేక తప్పులు చేసిందని ముందే ప్రకటించి ఉండాల్సింది కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ తప్పిదమే ఆయన పదవికి ఎసరు తెచ్చి పెట్టింది. రిపోర్టర్లు కమిషన్ మీద ఏవేవో ఊహించుకుని వార్తలు ప్రచురించేవారని పేర్కొన్నారు. దీనికి ముగింపు పలకడానికే విచారణ పురోగతి వివరించేందుకు విలేకరుల సమావేశాన్ని నిర్వహించినట్టు లేఖలో పేర్కొన్నారు. 'జడ్జి అయినా.. రిటైర్డ్ జడ్జి అయినా పక్షపాతం లేకుండా వ్యవహరించాలి. ఇలా జరిగినప్పుడు విచారణ సంఘం తమ ప్రాముఖ్యతను కోల్పోయినట్టే. న్యాయ వ్యవస్థ గౌరవాన్ని కాపాడే దిశలో తాను విచారణ సంఘం కమిషన్‌గా కొనసాగాలని భావించడంలేదు' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

రేవంత్ సూచనల మేరకు గడువు

సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న తీరును ఏజీ ఎప్పటికప్పుడు సీఎంకు సమాచారమిచ్చారు. కమిషన్ చైర్మన్‌ను మార్చాలన్న సుప్రీంకోర్టు సూచనను కూడా వివరించారు. దీంతో రేవంత్ సూచన మేరకే ఏజీ సుప్రీంకోర్టును సోమవారం వరకు గడువు కోరినట్టు తెలిసింది.

షరతులు ఎత్తేయాలి

మొదటిపేజీ తరువాయి...

పంట రుణాల మార్గదర్శకాలపై అసెంబ్లీ మీడియా హాల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు సంజయ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, వివేకానంద, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో చేతల పాలన పోయి షరతుల పాలన వచ్చిందని ఎద్దేవా చేశారు. పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేస్తే సగం మంది రైతులు రుణమాఫీకి దూరం అవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. రుణమాఫీపై ప్రభుత్వ నిబంధనలు చూస్తే, రైతుల వలపోతల కంటే వడపోతలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్టుగా ఉన్నదని మండిపడ్డారు. ఎన్నికల ముందు కుటుంబానికి ఒక్కరికే, రేషన్‌కార్డు ఉన్నవారికే రుణమాఫీ అని చెప్పి ఉంటే రైతులే తీర్పు చెప్పేవారని పేర్కొన్నారు. రుణమాఫీ చేయడానికి రైతా? కాదా? భూమి ఉన్నదా? లేదా? అనేది మాత్రమే చూడాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ మార్గదర్శకాలు బంగారంపై అప్పులు ఇచ్చే వాటి కంటే దారుణంగా ఉన్నాయని మండిపడ్డారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ప్రాతిపదికన రుణమాఫీ సరికాదని అభ్యంతరం వ్యక్తంచేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు పెట్టలేదని, రూ.లక్ష రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు.

రేషన్‌కార్డుతో కొట్లాట పెట్టుడే

రేషన్‌కార్డుతో లింక్ పెట్టడం అంటే కుటుంబంలో కొట్లాట పెట్టుడేనని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సంసారం వేరుపడ్డా రేషన్‌కార్డు ఒకటే ఉంటుందని, రేషన్‌కార్డులో విడిపోనంత మాత్రాన అర్హులు కాకుండా పోతారా? అని ప్రశ్నించారు. తండ్రికి రుణమాఫీ చేస్తాం, కొడుకుకు చేయం అంటే వారి మధ్య కొట్లాట పెట్టినట్టేనని స్పష్టంచేశారు. ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నవారికి ఏడు నెలలైనా కార్డులు ఇవ్వలేదని గుర్తుచేశారు. కార్డు లేదని రుణమాఫీ చేయకపోవడం దగా చేయడం కాదా? అని నిలదీశారు.

పీఎం కిసాన్‌తో సగం మందికి కట్

పీఎం కిసాన్ డాటాను పరిగణనలోకి తీసుకోవడం అంటే సగానికి సగం రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టినట్టేనని స్పష్టం చేశారు. రైతుబంధు కింద 68,99,079 మంది రైతులు లబ్ధి పొందితే, పీఎం కిసాన్ ద్వారా 30.36 లక్షల మందికే లబ్ధి కలుగుతున్నదని చెప్పారు. ఈ లెక్కన 39 లక్షల మందిని రుణమాఫీకి దూరం చేయడమేనని మండిపడ్డారు. రైతుబంధు కింద ఏడాదికి ఇచ్చింది రూ.15,248 కోట్లు అయితే, పీఎం కిసాన్ కింద ఇచ్చేది రూ.1,821 కోట్లు మాత్రమేనని తెలిపారు. అటు పీఎం ఇయ్యడు.. ఇటు సీఎం ఇయ్యడు, బడేభాయ్ బాటలో చోటే భాయ్ నడుస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఐటీ కట్టే వారితోపాటు ఆర్టీసీ, సింగరేణి, నాలుగో తరగతి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కూడా పీఎం కిసాన్‌కు అనర్హులు అని, వీరందరూ రుణమాఫీకి అనర్హులా? అని నిలదీశారు. రూ.2 లక్షలకు పైగా రుణం తెచ్చుకున్న రైతులు, రూ.2 లక్షలకు పైబడిన మొత్తాన్ని చెల్లిస్తేనే రుణమాఫీ చేస్తామంటే, అది తీర్చడానికి మళ్లీ బయట రూ.3 వడ్డీకి అప్పు తెచ్చికోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. 'అప్పు కట్టేందుకు అప్పు తెచ్చుకో' అన్నట్టుగా ప్రభుత్వం తీరు ఉన్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీళ్లు లేక పంటలు పండలేదని, రైతుభరోసా ఇవ్వలేదని ఇలాంటి సమయంలో అప్పు కట్టు అనడం తీవ్రమైన అన్యాయమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రుణమాఫీ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే వర్తిస్తుందనడం దారుణమని మండిపడ్డారు. దీర్ఘకాలిక పంటలకు లేదంటే బత్తాయి, మామిడి, ఆయిల్ పాం లాంటి పంటలకు రుణమాఫీ వర్తించదని చెప్పారు. దీంతో రాష్ట్రంలో దాదాపు పది లక్షల ఎకరాలకు రుణమాఫీ లేనట్టేనని స్పష్టం చేశారు.

రీ షెడ్యూల్‌తో రైతులకు నష్టం

రీ షెడ్యూల్ చేసుకున్న వారికి రుణమాఫీ వర్తించదని చెప్పడం దారుణమని హరీశ్‌రావు మండిపడ్డారు. తీవ్రంగా రైతులు నష్టపోయినప్పుడు, కరువు పరిస్థితులు ఉన్నప్పుడు, వరదలు వచ్చి పంటలు కొట్టుకుపోయినప్పుడు రీ షెడ్యూల్ చేయాలని రైతులు అడగకపోయినా ప్రభుత్వం, బ్యాంకులే రీ షెడ్యూల్ చేస్తాయని చెప్పారు. ప్రభుత్వం చేసిన పనికి రైతులకు ఎందుకు శిక్ష? అని ప్రశ్నించారు. అప్పులు కట్టిన వారికి మొండిచేయి చూపడం సరికాదని పేర్కొన్నారు. జేఎల్జీ, ఎస్‌హెచ్‌జీ, ఎఫ్‌పీవో వారికి రుణమాఫీ చేయం అన్నారని, ఈ గ్రూపుల్లో చిన్న రైతులు ఉంటారని, గ్రూపుగా ఏర్పడి పంటలు పండిస్తారని వివరించారు. రుణమాఫీకి స్టార్టింగ్ డేట్ ఉండదని, ఎండింగ్ డేట్ మాత్రమే ఉంటుందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా అలాగే చేసిందని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 2018 డిసెంబర్ 12 కంటే ముందు తీసుకున్న రుణాలకు వర్తించదు అని చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు.

ఆ వడ్డీని ప్రభుత్వమే కట్టాలి

అసలు, వడ్డీ కలిపి రెండు లక్షలు మాఫీ చేస్తమన్నారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9 నాడే మాఫీ చేస్తాం అన్నారని, డిసెంబర్ నుంచి మాఫీ అయ్యే వరకు పడిన వడ్డీ ఎవరు భరించాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులు ఇచ్చే సమాచారానికి, తప్పులకు వారే బాధ్యులంటూ రైతులను బెదిరించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గతంలో సీఎం మాట్లాడుతూ.. రేషన్‌కార్డు ప్రామాణికం కాదు అన్నారని, నాలుగు రోజుల తర్వాత రేషన్‌కార్డే ప్రామాణికం అంటున్నారని మండిపడ్డారు. రుణమాఫీకి షరతులు పెట్టి, వ్యాపారంలో చేసినట్టుగా రైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు.

అవి అమలు చేస్తే రాజీనామాకు సిద్ధం

బాండ్ పేపర్ మీద రాసిచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలు సహా ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు మరోసారి స్పష్టం చేశారు. దానికి కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. తనకు ఎమ్మెల్యే పదవి ముఖ్యం కాదని స్పష్టంచేశారు. కొండనాలుక మందేస్తే ఉన్న నాలుక పోయినట్టుగా పరిస్థితి తయారైందని, ఎకరాకు రూ.7,500 రైతు భరోసా, నాలుగు వేల పింఛన్ అమలు చేయకపోగా, రెండు వేల పింఛన్ కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇల్లు, విద్యార్థి భరోసా కార్డు ఇస్తే అప్పుడు తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పదవిలో ఉన్నామని గొంతు చించుకొని మాట్లాడితే లాభం లేదని చురకలేశారు. ఎంతమందికి ఉచిత కరెంట్, గ్యాస్ ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతు ఆత్మహత్య లేని రోజు లేదని, 400 పై చిలుకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ వివరాలు పంపితే రైతులకు పరిహారం ఇస్తామని సీఎం అన్నారని, కానీ ఆ వివరాలు పంపితే ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ప్రభుత్వం రైతులకు భరోసా ఇవ్వడంలో విఫలమవుతున్నదని దుయ్యబట్టారు. సమావేశంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు సునీతా లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్, సంజయ్‌కుమార్, వివేకానంద్ పాల్గొన్నారు.

58 లక్షల మందికి రుణమాఫీ చేశాం

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మొదటి విడతలో 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్లు, రెండో విడతలో 22.98 లక్షల మంది రైతులకు రూ.13 వేల కోట్ల చొప్పున మొత్తం రూ.29,144 కోట్లు రుణమాఫీ చేశామని హరీశ్‌రావు వివరించారు. ఇప్పుడు ఇన్ని నిబంధనలు పెట్టి రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

పాస్‌బుక్‌నే ప్రామాణికంగా తీసుకోవాలి

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీకి పాస్‌బుక్‌నే ప్రామాణికంగా తీసుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీకి ఏ సూత్రాన్ని అయితే పాటిస్తున్నారో అదే సూత్రాన్ని రైతు రుణమాఫీకి వర్తింపచేయాలన్నారు. రేషన్‌కార్డుకు ఆరోగ్యశ్రీకి లింకు పెట్టొద్దని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో హరీశ్‌రావు ఎక్స్‌లో స్పందించారు. ఇదే విధానాన్ని రైతు రుణమాఫీకి పాటిస్తే బాగుంటుందని తెలిపారు.

ఐటీ రిటర్న్ పొందినవారికీ

రుణమాఫీ

- 2 లక్షలకుపైగా ఉన్న రుణం కట్టాల్సిందే
- కుటుంబం కోసమే రేషన్‌కార్డు.. పాస్‌బుక్ ఆధారం
- 39 లక్షల కుటుంబాల్లో 60 లక్షల మందికి రుణం
- లక్ష వరకు మాఫీ.. రైతు వేదికల్లో సంబురాలు
- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూలై 16(నమస్తే తెలంగాణ): ఆదాయం పన్ను చెల్లించి, వాటిని తిరిగి పొందినవారు కూడా రైతు రుణమాఫీకి అర్హులేనని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారికి, సివిల్ సర్వీసెస్, పెద్దవాళ్లకు మాత్రం రుణమాఫీ లేదని చెప్పారు. కుటుంబాన్ని గుర్తించేదుకు మాత్రమే రేషన్‌కార్డు వినియోగిస్తామని, పాస్ పుస్తకం ఆధారంగానే రుణమాఫీ చేస్తామని తెలిపారు. కానీ, కొంత మంది రేషన్‌కార్డు ఆధారంగానే రుణమాఫీ చేస్తున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన విధంగానే రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. మంగళవారం ఆయన సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఇచ్చినమాట ప్రకారం ఆగస్టు 15లోపు రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. గురువారం రూ.లక్ష వరకు గల రుణాలను మాఫీ చేస్తామని తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా రైతువేదికల్లో సంబురాలు నిర్వహిస్తామని, ఈ వేడుకల్లో రైతులందరూ పాల్గొనాలని ఆహ్వానించారు. మిగిలిన మొత్తాన్ని అతి త్వరలోనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.2 లక్షలు మాత్రమే రుణమాఫీ చేస్తామని స్పష్టంచేశారు. కుటుంబానికి రూ.2 లక్షలకు మించి రుణం ఉంటే.. ఆ మొత్తాన్ని ముందుగానే రైతులు బ్యాంకులకు చెల్లించాలని, ఆ తర్వాతే రైతుల ఖాతాల్లో రూ.2 లక్షల రుణమాఫీ డబ్బులను ప్రభుత్వం జమ చేస్తుందని తేల్చిచెప్పారు.

పాస్‌బుక్కే ఫైనల్

మొదటిపేజీ తరువాయి...

లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టర్లు జిల్లా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. రుణమాఫీకి ప్రభుత్వం విడుదల చేసే నిధులను రైతు రుణమాఫీకే వాడాలని, వ్యక్తిగత, ఇతర రుణాల మాఫీకి వినియోగించవద్దని బ్యాంకర్లకు స్పష్టంచేయాలని సూచించారు. గతంలో కొందరు బ్యాంకర్లు అలా చేస్తే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, ఇప్పుడు కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. రుణమాఫీ జరిగే రైతులను రైతు వేదికల వద్దకు తీసుకొనిరావాలని, ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు రైతులతో ఆ సంతోషాన్ని పంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతు రుణమాఫీకి సంబంధించి సచివాలయంలో రెండు జిల్లాలకు ఒక ఉన్నతాధికారిని అందుబాటులో ఉంచుతామని, కలెక్టర్లకు ఏవైనా సందేహాలు వస్తే వారితో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను నిలిపివేసి, రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో వారు మాట్లాడుతూ.. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు కొర్రీలు విధించడం సమంజసం కాదన్నారు.

మార్గదర్శకాలను సవరించాలి: పటోళ్ల

రుణమాఫీ మార్గదర్శకాలను సవరించాలని మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

రుణమాఫీ జీవోను సవరించండి: తమ్మినేని

రైతులకు రుణమాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో-567లోని నిబంధనలతో పేద రైతులకు రుణమాఫీ వర్తించదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆందోళన వ్యక్తంచేశారు. అత్యధిక మందికి రుణమాఫీ జరిగేలా జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపడిన దాదాపు 10 లక్షల కుటుంబాలు రుణమాఫీకి అర్హులు కాకుండా పోయే ప్రమాదం ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

నిబంధనలే రైతులకు ఉరితాళ్లు: ఈటల

హైదరాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ): రుణమాఫీకి ప్రభుత్వం జారీ నిబంధనలే రైతులకు ఉరితాళ్లుగా మారాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే నిబంధనలు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సర్కారుకు ప్రజాక్షేత్రంలో శిక్షతప్పదని హెచ్చరించారు. మంగళవారం నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు.

• రుణమాఫీ షరతులపై రైతుల నిరసన

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతు రుణమాఫీ జీవోను తక్షణమే సవరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా బస్టాండ్ సెంటర్‌లో రైతు రుణమాఫీ జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. నిబంధనల్లో తెల్ల రేషన్‌కార్డు, పాస్ పుస్తకాలు, రెన్యూవల్, రీషెడ్యూల్, గడువును సవరించి రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్‌కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉంటాయని వారందరికీ అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కొర్రీలు పెట్టకుండా ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. – వైరాటౌన్

రేషన్‌కార్డా? పాస్‌పుస్తకమా?

మొదటిపేజీ తరువాయి...

తర్వాత అందులో ఏదుంటే అదే ఫైనల్ అవుతుంది. మార్గదర్శకాల్లో రేషన్‌కార్డు అని పేర్కొని, ముఖ్యమంత్రి మాత్రం పాస్‌బుక్ అని చెప్పడంతో ఈ గందరగోళం ఏర్పడింది. ఒకవేళ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా రుణమాఫీకి పాస్‌బుక్ ప్రామాణికమైతే కుటుంబం, రేషన్‌కార్డు ప్రస్తావన ఎందుకు వస్తుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. సాధారణంగా రైతుకుండే భూమికి పాస్‌పుస్తకమే ప్రాతిపదిక. అలాంటప్పుడు భూమితో ఏ సంబంధమూ లేని రేషన్‌కార్డు ప్రస్తావన ఎందుకు వస్తున్నదో అర్థంకాని పరిస్థితి.

పాస్‌బుక్ ప్రామాణికమైతే మళ్లీ రేషన్‌కార్డు ఎందుకు?

రుణమాఫీకి పట్టాదారు పాస్ పుస్తకమే ప్రాతిపదిక అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టతనిచ్చారు. దీని ప్రకారం పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలి. కానీ, ప్రభుత్వం అలా చేయడం లేదు. కుటుంబం పేరుతో రేషన్‌కార్డు నిబంధన పెట్టింది. తద్వారా అర్హుల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నది. పట్టాదారు పాస్‌బుక్‌ను పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులు ఉంటారు. రేషన్‌కార్డును లింకు చేసి కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటే రైతుల సంఖ్య 60 లక్షలు మాత్రమే. అంటే 10 లక్షల మంది రైతులకు రుణమాఫీలో కోత పెట్టే అవకాశం ఉన్నది. కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ చేస్తే ఆ కుటుంబంలోని రైతులకు నష్టం జరుగుతుంది. రైతులను వేర్వేరుగా పాస్‌బుక్ ద్వారా గుర్తించి రుణమాఫీ చేస్తే వారంతా రుణవిముక్తులవుతారు. రేషన్‌కార్డు నిబంధన ద్వారా కుటుంబం మొత్తానికి రూ.2 లక్షలు మాత్రమే రుణమాఫీ అయితే, పట్టాదారు పాస్‌బుక్ ద్వారా ఒక్కొక్కరికి రూ.2 లక్షల రుణమాఫీ అవుతుంది. ఈ నేపథ్యంలో పాస్‌బుక్ ప్రామాణికమైతే మళ్లీ రేషన్‌కార్డును లింకు చేసి కుటుంబం యూనిట్‌గా గుర్తించాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ నిబంధన అమలుతో అనేకమంది రైతులకు అనేక ఇబ్బందులు, నష్టాలు జరగనున్నాయి.

- ఉదాహరణకు ఒక కుటుంబ యజమాని పేరు మీద రేషన్‌కార్డు ఉన్నది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులకు పెండ్లిండ్లు అయి వేర్వేరు కాపురాలుంటున్నారు. కానీ, పదేండ్లుగా కొత్త రేషన్‌కార్డులు జారీ కానందువల్ల వారికి రేషన్‌కార్డులు లేవు. తండ్రి రేషన్‌కార్డు మీదే వారి పేర్లు కూడా ఉన్నాయి. కుటుంబ యజమానితోపాటు భార్యకు, ఇద్దరు కుమారులకు రెండేసి ఎకరాల చొప్పున భూమి ఉన్నది. పాస్‌బుక్‌లు ఉన్నాయి. ఒక్కో పాస్‌బుక్ మీద రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు పంట రుణం తీసుకోవడం సహజం. అంటే ఆ కుటుంబం మొత్తానికి కలిపి 4-6 లక్షల పంట రుణం ఉంటుంది. వీరికి ఆ మొత్తం రుణమాఫీ అవుతుందా? కాదా? అన్నది ఇప్పుడు ప్రశ్న. రేషన్‌కార్డునే ప్రాతిపదికగా తీసుకుంటే తొలుత యజమాని భార్యకు, తర్వాత యజమానికి కలిపి గరిష్ఠంగా రెండు లక్షల వరకు మాఫీ అవుతుంది. కుమారులకు రుణ మాఫీ జరిగే అవకాశం ఉండదు. ఒకవేళ పాస్‌బుక్‌నే ప్రాతిపదికగా తీసుకుంటే కుమారులకు కూడా మాఫీ చేయడం తప్పనిసరి. మరి ప్రభుత్వం ఏం చేయబోతున్నది?
- కుమారులు మేజర్ అయినప్పుడు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం, వారిని వేరే కుటుంబంగా పరిగణించాల్సి ఉంటుంది. కేవలం రేషన్‌కార్డు మీద పేర్లు ఉన్న కారణంగా వారిని తండ్రి కుటుంబంలో భాగంగా పరిగణిస్తారా? లేక వేరే కుటుంబంగానా? అన్నదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉన్నది.
- కొడుకులతో సహా ఒక కుటుంబంగానే పరిగణించినప్పుడు, వారికి రూ4-6 లక్షల బాకీ ఉందనుకుందాం. వీరు రెండు లక్షలకు పైబడి ఉన్న అప్పును మొదట చెల్లిస్తేనే మిగతా రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందా? లేక కుటుంబ యజమాని, ఆయన భార్య మాత్రమే తమ భూముల మీద తీసుకున్న దాంట్లో పైచిలుకు దాన్ని కడితే సరిపోతుందా? అనేది తెలియడం లేదు.
- పైన పేర్కొన్న అందరినీ కలిపి ఒక కుటుంబంగానే పరిగణించి రుణమాఫీ చేస్తే, మాఫీ చేసిన రూ.2 లక్షల మొత్తంలో తమ వాటా కూడా ఉన్నదని మిగతా కుటుంబ సభ్యులు గొడవకు దిగరా? దీనికి పరిష్కారం ఏమిటన్నది సామాజిక నిపుణుల ప్రశ్న.
- రేషన్‌కార్డు ఉన్న కుటుంబాలనైతే, ఆ కార్డు సాయంతో కుటుంబంగా గుర్తిస్తారు. రేషన్‌కార్డు లేని కుటుంబాలకు పాస్‌బుక్ ప్రాతిపదికగా తీసుకుంటామని ప్రభుత్వం చెప్తున్నది. ఇలాంటి వాళ్లను ఒక కుటుంబంగా గుర్తించే అవకాశం లేదు. ఈ లెక్కన రేషన్‌కార్డు లేని కుటుంబాల సభ్యులకేమో విడివిడిగా ఒక్కొక్కరికీ రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ వర్తిస్తుంది. రేషన్‌కార్డు ఉన్న కారణం వల్ల ఉమ్మడి కుటుంబంలోనేమో అందరికీ కలిపి రూ.2 లక్షల వరకే వర్తిస్తుంది. రేషన్‌కార్డే లేని కుటుంబం ఎక్కువ లాభం పొందుతుంటే, రేషన్‌కార్డున్న కుటుంబం రెండు లక్షలతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నది. ఇదెలా న్యాయమనే ప్రశ్న తలెత్తుతున్నది.
- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇచ్చిన లెక్క ప్రకారం.. రేషన్‌కార్డుల ఆధారంగా 39 లక్షల రైతు కుటుంబాలను గుర్తించారు. అందులో 60 లక్షల మంది రుణం తీసుకున్నారు. రేషన్‌కార్డు ప్రకారం కుటుంబానికి రెండు లక్షలే ప్రాతిపదిక అయితే 39 లక్షల రైతులకే రుణమాఫీ అమలవుతుంది. అంటే 21 లక్షల కుటుంబాలు లేదా రైతులు.. పాస్‌బుక్కు ఉండి, రుణం తీసుకుని కూడా, కేవలం రేషన్‌కార్డు లేనందున అనర్హులవుతారన్నమాట. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

కోతలు పెట్టేందుకే కండీషన్లా?

సాధారణంగా రైతులకు పంట రుణాలు ఇచ్చేప్పుడు బ్యాంకులు అన్నీ ఆలోచించి, అన్నీ పరిశీలించాకే రుణాలు ఇస్తాయి. ఇలా ఒకసారి రైతుకు బ్యాంకు రుణం ఇచ్చిందంటే ఆ రైతు రుణమాఫీకి పూర్తిస్థాయిలో అర్హుడవుతాడు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రుణాలు ఇచ్చేటప్పుడు బ్యాంకులు పెట్టని కండీషన్లను రుణమాఫీ చేసేటప్పుడు అమలు చేస్తున్నది. తద్వారా అర్హత ఉన్నప్పటికీ కొంతమంది రైతులకు రుణమాఫీ కాకుండా ప్రయత్నిస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. రేషన్‌కార్డు ద్వారా కుటుంబాన్ని గుర్తిస్తామని, కుటుంబానికి రూ.2 లక్షలు మాత్రమే మాఫీ చేస్తామంటూ షరతులు పెడుతున్నది. అయితే రుణమాఫీ భారాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలాంటి షరతులు పెడుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.